క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

బెల్లంపల్లి: వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి మ్యాంగో మార్కెట్‌లో ఈసారి మామిడి కాయలు కొనుగోలు చేపట్టడానికి యత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతుల సౌకర్యార్థం మామిడి ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత పత్రాలు అందజేసి మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి లైసెన్స్ తీసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పట్టణ అభివృద్ధిలో నిర్లక్ష్యం



స్థానికులతో మాట్లాడుతున్న రఘునాథ్

నస్పూర్: పట్టణ పరిధి సింగరేణి ప్రాంతంలో రూ.వేల కోట్ల ఆదాయం ఉన్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆరోపించారు. సీతారాంపల్లిలో శనివారం ఆయన 'గావ్‌చలో–బస్తీచలో' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. స్థానికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రేషన్‌షాపును సందర్శించారు. నస్పూర్ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, నాయకులు జీవీ ఆనంద్‌కృష్ణ, మిట్టపల్లి మొగిలి, కట్కూరి సతీష్‌కుమార్, పానుగంటి మధు, ఈర్ల సధానందం, కుర్రె చక్రి, పానవేని సదయ్య, చల్లా విక్రమ్, గొల్ల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

బెల్లంపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. శనివారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) విద్యాలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణను అలవర్చుకోవాలన్నారు. చిన్నతనం నుంచే శ్రద్ధగా చదువుకోవడంతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన సంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు నగేశ్, అద్దూరి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తీరంలో గంగా హారతి

చెన్నూర్: చెన్నూర్ పంచక్రోశ ఉత్తర వాహిని గోదావరి నది తీరంలో పౌర్ణమి సందర్భంగా శనివారం సాయంత్రం గంగా హారతి కార్యక్రమాన్ని అర్చకులు కసోజ్జల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గోదావరిలో ప్రతి పౌర్ణమి రోజున గంగా హారతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కాళేశ్వర్ ధర్మకర్తలి మండలి సభ్యులు శ్యాంసుందర్ దేవుడా, భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డకు ఎంబీబీఎస్ పట్టా

కాసిపేట: మండలంలోని దేవాపూర్ నాయకపుగూడకు చెందిన ఆదివాసీ బిడ్డ రొడ్డ దినేష్ ఉస్మానియా మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి పట్టా అందుకున్నాడు. దీంతో ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీలు, దేవాపూర్ నాయకులు ఆయనను అభినందించారు.

కారు ఢీకొని లేగదూడ మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందుగులపేట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం కారు లేగదూడను ఢీకొంది. ఈ ప్రమాదంలో లేగదూడ అక్కడికక్కడే మృతి చెందగా కారు పాక్షికంగా దెబ్బతింది. ఎస్సై రాజశేఖర్ ఘటన స్థలి వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

అంబులెన్సులో ప్రసవం



శిశువుతో అంబులెన్సు సిబ్బంది

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి తలమల గ్రామానికి చెందిన కొడప గంగుబాయి అనే గర్భిణీ పురిటినొప్పులతో బాధపడగ కుటుంబసభ్యులు అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో హాస్పిటల్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆడ శిశువు జన్మనిచ్చినట్లు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వెంటనే ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ అనిల్, పైలెట్ సత్యం తెలిపారు.

నెరవేరిన రహదారి కల

- క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి
- 15న ప్రారంభానికి సన్నాహాలు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పరిసర ప్రాంత ప్రజల దశాబ్దాల చిరకాల స్వప్నం ఎట్టకేలకు నెరవేరింది. రైల్వేఫ్లై ఓవర్ బ్రిడ్జి ఈ నెల 15న ప్రారంభం కానుంది. రామకృష్ణాపూర్–మంచిర్యాల మార్గంలో క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పన్నెండేళ్లు కావస్తున్నా పూర్తి కాకపోవడం స్థానికులను అసంతృప్తి, అసహనానికి గురి చేసింది. పట్టణమే కాకుండా అమరవాది, శేషుపల్లి, మందమర్రి, సారంగపల్లి తదితర ప్రాంతాలకు ఈ మార్గం అనుకూలంగా ఉంటుంది. దూరంలో కూడా వ్యత్యాసం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే బ్రిడ్జి ఎప్పుడు పూర్తవుతుందా అని ఎదురు చూస్తున్నారు. అప్పట్లో పెద్దపల్లి ఎంపీగా ఉన్న గడ్డం వివేక్ వెంకటస్వామి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని 2011లో మంజూరు చేయించగా.. 2013లో నిధులు విడుదల అయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ సేకరణ పనులు, నిర్వాసితుల సమస్యలు పరిష్కారంతో పనులు పుంజుకున్నాయి. బ్రిడ్జి పనులు పూర్తి కావడానికి పన్నెండేళ్ల సమయం పట్టగా రెండు ప్రభుత్వాలు మారాయి. ఎంపీగా ఉన్న సమయంలో బ్రిడ్జి మంజూరే చేయించగా..ఎమ్మెల్యేగా వివేక్‌వెంకటస్వామి తన హయాంలోనే ప్రారంభించనుండడం గమనార్హం.

పోటాపోటీ కార్యక్రమాలు

బ్రిడ్జి ప్రారంభం కానుండడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు తమ హయాంలో జరిగిందంటే.. తమ హయాంలో అంటూ పోటాపోటీ ప్రచారం చేసుకుంటున్నారు. ఘనతను తమ పార్టీ ఖాతాలో వేసుకోవాలని పోటాపోటీ పాలాభిషేకాలు చేశారు. రెండు పార్టీల వ్యవహార శైలిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిరుపయోగంగా వర్మీకంపోస్ట్ యూనిట్



భీమారం: మండల కేంద్రంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ నర్సరీలో నిర్మించిన వర్మీకంపోస్ట్ ఎరువు తయారీ యూనిట్ నిరుపయోగంగా మారింది. కొన్నినెలల పాటు ఎరువు తయారీ చేసిన అటవీశాఖ అధికారులు అనంతరం చేతులెత్తేశారు. ఉపయోగంలోకి తెస్తే ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులకు ఫలితం దక్కుతుందని ప్రజలు అంటున్నారు.

సంబంధిత అధికారి : రత్నాకర్‌రావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మంచిర్యాల
ఫోన్ నంబర్: 94403 13191

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదురుగా గల గోవింద క్షేత్రం ఆవరణలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శనను కమాండెంట్ దంపతులు పద్మ–వెంకటరాములు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నృత్య కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది, నృత్య కళాకారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి



నివాళులర్పిస్తున్న జాన్సన్‌నాయక్, చిన్నయ్య

జన్నారం: మహనీయుల చరిత్ర తెలుసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తేనే చరిత్ర సృష్టించగలమని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మహనీయుల జయంతి ఉత్సవాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే, డా.బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలకేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్న, తెలంగాణ తల్లి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌నేత, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగాధర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజరాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్, జిల్లా అధికార ప్రతినిధి భరత్‌కుమార్, నాయకులు మున్వర్ అలీఖాన్, ప్రభుదాస్, ఫజల్‌ఖాన్, నర్సింహులు, సత్యం, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పవర్‌కట్ ప్రాంతాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట సబ్‌స్టేషన్‌లో, 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కేశెట్టి శ్రీనివాస్ తెలిపారు. దుగ్నెపల్లి, కొమ్మెర, ఆస్నాద, పొక్కూరు గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

దండేపల్లి: లక్సెట్టిపేట 33కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని లక్సెట్టిపేట, దండేపల్లి మండలంలోని గూడెం, వెల్గనూర్, సబ్‌స్టేషన్లు, దండేపల్లి ఫీడర్ పరిధిలోని దండేపల్లి, ముత్యంపేట, లింగాపూర్, జన్నారం ఫీడర్ పరిధిలోని జన్నారం, తపాలపూర్, కవ్వాల్, కలమడుగు విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆదివా రం 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు చేస్తున్నట్లు లక్సెట్టిపేట విద్యుత్ ఏడీఈ ప్రభాకర్‌రావు తెలిపారు. ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం



గడువు ముగిసిన చెక్కుతో లబ్ధిదారురాలు

కోటపల్లి: బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు అన్యాయం జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన బోమ్మ శోభ కుమార్తెకు వివాహం జరగ్గా కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116 చెక్కు జనవరి 8న మంజూరైంది. రెవెన్యూ అధికారులు ఎన్నికల కోడ్ కారణంగా చెక్కును మార్చి 5న శోభకు అందజేయగా వెంటనే కోటపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో జమ చేసింది. చెక్కు గడువు మూడు నెలలే కాగా బ్యాంక్‌లో జమ చేసి నెలరోజులు గడిచినా శోభా అకౌంట్‌లో నగదు జమ కాలేదు. శుక్రవారం బ్యాంక్‌ను సంప్రదించగా చెక్కు గడువు ముగిసిందని మరొక చెక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ తెలపడంతో శోభ కంగుతింది. బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో చెక్కు చెల్లకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. బ్యాంక్ మేనేజర్ రాజేశ్‌ను వివరణ కోరగా నెలరోజులు గడువు ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో నగదు జమ కాలేదని మరొక చెక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించామన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలి



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

మందమర్రిరూరల్: వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు డ్యూటీ పనివేళలు మార్చాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు గజ్జి మల్లేష్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. సివిల్, పార్క్ విభాగాల్లో పనిచేసే కార్మికులకు ఉదయం 6గంటల నుంచి ఒంటి గంట వరకే డ్యూటీ ఉండాలని ఇదివరకే జీఎం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపించారు. ఎండల తీవ్రత వల్ల కార్మికులు వడదెబ్బకు గురై ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని తెలిపారు.

నర్సరీలో పనివేళలు మార్చాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఫారెస్ట్ విభాగంలోని పార్కులు, నర్సరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేసవి దృష్ట్యా పనివేళలు మార్చాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఆ యూనియన్ నాయకులు శ్రీరాంపూర్‌లోని ఫారెస్ట్ డిపార్టుమెంట్ జూనియర్ అధికారినికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, ఆ యూనియన్ ఉపాధ్యక్షుడు రాచర్ల చంద్రమోహన్, నాయకులు కాతిరాజు ప్రభాకర్, కొట్టే లక్ష్మి, స్వప్న, స్వరూప పాల్గొన్నారు.

మూల్యాంకన రెమ్యూనరేషన్ చెల్లించాలి



మజ్జిగ పంపిణీలో డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: మూల్యాంకన విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక కార్మెల్ కాన్వెంట్ స్కూల్లో నిర్వహిస్తున్న స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద ఆయన మాట్లాడారు. గత సంవత్సరం మూల్యాంకన భత్యం ఆలస్యంగా విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అంతకుముందు తపస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డీఈవో యాదయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు, జిల్లా నాయకులు సమ్మయ్య, నిలేశ్ కచ్వాల్, భారతి ఆశోక్, రమాదేవి, రమేష్, లక్ష్మణచారి, రజితలు పాల్గొన్నారు.

ప్రాణదాతలుగా నిలువాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఈడీ చిరంజీవి

భీమారం: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని జైపూర్ ఎస్టీపీపీ ఈడీ సీహెచ్ చిరంజీవి పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఎస్టీపీపీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 95 మంది రక్తదానం చేశారు. మంచిర్యాల రెడ్ క్రాస్‌సొసైటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, చీఫ్ ఆఫ్ ఓ జెన్‌సింగ్, ఏజీఎం మదన్‌మోహన్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై శ్రద్ధ వహించాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు పోటీ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ శాస్త్రవేత్త ముంజం శంకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ రమా కల్యాణి, ఉమా మహేశ్వర్‌రావు, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైంటిస్టు శంకర్‌రావు



చెన్నూర్: హనుమాన్ టెంపుల్‌లో...



చెన్నూర్‌రూరల్: ఒత్కులపల్లిలో...



జన్నారం: హోమం కాలుస్తున్న భక్తులు

ఘనంగా హనుమాన్ జయంతి



భీమిని: కన్నెపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

చెన్నూర్‌రూరల్/దండేపల్లి/భీమారం/జన్నారం/చెన్నూర్/కాసిపేట/భీమిని/శ్రీరాంపూర్: జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తజనం పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంజనేయస్వామికి అభిషేక పూజలు నిర్వహించి, చందనం వేసి తమలపాకులు, మల్లెపూల దండలతో అలంకరించారు. మహిళలు మంగళ హారతులతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలువురు హనుమాన్ దీక్షపరులు కాలినడకన కొండగట్టుకు వచ్చారు.దండేపల్లి మండలం మేదరిపేట హనుమాన్ ఆలయంలోని శ్రీ ఆంజనేయస్వామికి అదే గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ వెండి కిరీటం, కడియాలు బహూకరించారు. గూడెం శ్రీసత్యనారాయణస్వామి కొండ చుట్టూ హనుమాన్ దీక్షాపరులు గిరిప్రదక్షణ చేశారు. జన్నారం మండలం పైడిపెల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జక్కు సత్తయ్య, కుమారులు రమేశ్, భూమేశ్, శ్రీనివాస్ దంపతులతో రామయజ్ఞం చేశారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ పూజల్లో పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని పలు ఆలయాలు, కూడళ్ల వద్ద వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పండ్లు, మజ్జిగ, వాటర్ పంపిణీ చేశారు.



దండేపల్లి: సత్యదేవుని కొండ వద్ద దీక్షాపరులు



భీమారం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



జీఎం కార్యాలయం సమీపంలో పండ్లు పంపిణీ

సంక్షిప్త వార్తలు

పేకాటస్థావరంపై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి రాంనగర్ బస్తీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య కథనం ప్రకారం ..బస్తీలో ఇరవేణి ప్రసన్న ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై రాకేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆ ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. మరొకరు పరారీలో ఉన్నారని ఎస్‌హెచ్‌వో తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 1,11,140 నగదు, 5 సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

దత్తత పాఠశాలల పరిశీలన

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన భూముల రంజిత్‌కుమార్ మండలంలో దత్తత తీసుకున్న పాఠశాలలను శనివారం సందర్శించారు. దిక్సూచి ఫౌండేషన్ స్థాపించి మండలంలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నారు. కిష్టాపూర్, అక్కపల్లిగూడ, పొనకల్ ప్రాథమిక పాఠశాలలు, ధర్మారం, రేండ్లగూడ ప్రాథమికోన్నత పాఠశాలలను శనివారం పరిశీలించారు. ఇటీవల అమెరికా నుంచి వచ్చిన తర్వాత కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలకు మల్టీమీడియా ప్రాజెక్టర్, ల్యాప్‌ట్యాప్ అందజేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌నాయక్, శ్రీనివాస్, రాజేశం, సత్తన్న, కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

13న మున్నూరు కాపు ప్రతినిధుల సదస్సు

శ్రీరాంపూర్: ఈ నెల 13న మున్నూరు కాపు ప్రతినిధుల సదస్సు నిర్వహిస్తున్నట్లు మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి గుర్రపు సతీశ్‌పటేల్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు, దీనికి కులానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు అన్ని వర్గాలకు చెందిన ముఖ్యులు హాజరై మున్నూరు కాపు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. త్వరలో జరగబోయే మున్నూరు కాపు గర్జన సభకు సంబంధించిన పోస్టర్ల ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

తాండూర్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ అన్నారు. తాండూర్ ఐబీ చౌరస్తాలో శనివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పుర వీధుల మీదుగా ర్యాలీ చేశారు.